




# కరపత్రం

SINCE 2014

మంగళవారం ఏప్రిల్ 7, 2026 | సంపుటి : 2 | సంచిక : 176 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

## ఆదిలాబాద్,కు గోదావరి నీరు పారిస్తా

- తుమ్మడిహట్టి నిర్మించి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం
- బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ది
- ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన
- త్వరలోనే జిల్లాకు యూనివర్సిటీ మంజూరు
- పర్యాటకంగా, పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధి
- జిల్లా అభివృద్ధిని విస్మరించిన గత పాలకులు
- పిప్రిలో రూ.695 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

**ఆదిలాబాద్,ఏప్రిల్6**

గత ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును పక్కనపెట్టి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును నిర్మించి ఆదిలాబాద్ జిల్లాలో గోదావరి నీళ్లు పారిస్తుందని చెప్పారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని, ఈ జిల్లాను పర్యాటకంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. త్వరలోనే జిల్లాకు యూనివర్సిటీ మంజూరు చేసి శంకుస్థాపన చేస్తామన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలో ఉన్న ఆలయాలన్నింటినీ అభివృద్ధి చేస్తామన్నారు. ఆదిలాబాద్ జిల్లాపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు పిప్రి నుంచే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ చేపట్టి ప్రజా సమస్యలు తెలుసుకున్నారని ఆయన చెప్పారు. ఆదిలాబాద్ ప్రజలు అమాయకులే కాదు.. నిరంకుశత్వంపై పోరాడిన వీరులంటూ జిల్లా వాసులపై ప్రశంసల వర్షం కురిపించారు. ఆదిలాబాద్ జిల్లా పిప్రిలో ముఖ్యమంత్రి, పలువురు మంత్రులు పర్యటించారు. ఈ సందర్భంగా రూ.695 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రగతి పాలన బహిరంగ సభకు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..2029 వరకు జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల హద్దులు మార్చవద్దని కేంద్రం చెప్పింది. కేంద్రం ఆంక్షలు ఎత్తివేయగానే హద్దులు మారుస్తాం. కాళేశర్వం కూలేశ్వరం అయ్యింది. గత పాలకులు తుమ్మిడిహట్టిని పక్కనపెట్టి ఆదిలాబాద్‌కు అన్యాయం చేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్ట్‌ను నిర్మించి ఆదిలాబాద్‌కు నీళ్లిస్తాం' అని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి ఆదిలాబాద్ దూరంగా ఉంది. కేసులు, అక్రమ నిర్బంధాలకు వ్యతిరేకంగా పోరాడి అధికారంలోకి వచ్చాం. విపక్ష ఎమ్మెల్యేలను శత్రువులు గా కాంగ్రెస్ ప్రభుత్వం చూడదు. బీజేపీ, బీఆర్ఎస్ మాకు రాజకీయ ప్రత్యర్థులు మాత్రమే.. శత్రువులు కాదు. అభివృద్ధి పనుల కార్యక్రమానికి విపక్ష ఎమ్మెల్యేలను కూడా పిలిచాం. గతంలో ముఖ్యమంత్రి వస్తుంటే విపక్ష నేతలను అరెస్టులు, గృహనిర్భంధాలు చేసేవారు. ఇక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేకపోయినా నిధులు ఇస్తున్నాం.

మిగతాద్ది 2 లో

## హామీలను అమలు చేసిన ఘనత మాది

- పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీలకు కార్యరూపం
- మాకు వ్యక్తిగత ఎజెండా లేదన్న భట్టి విక్రమార్క



**ఆదిలాబాద్,ఏప్రిల్6 :**

అధికారంలోకి వచ్చేందుకు నేతలు ఎన్నో హామీలు ఇస్తుంటారని, కొందరు అధికారంలోకి రాగానే వాటిని మర్చిపోతారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తాము అలాంటివాళ్లం కాదన్నారు. తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్‌కు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా పిప్పిరిలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పిప్పిరిలో మొదలుపెట్టి ఖమ్మం వరకు పాదయాత్ర చేసినట్లు గుర్తు చేసుకున్నారు. పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీల అమలుపై జీవోలు జారీ చేశాం. ఇవాళే రూ.1,238 కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశాం. ఒకే విడతలో రుణమాఫీ చేసి రూ.22,500 కోట్లను రైతుల ఖాతాల్లో వేశాం. ప్రతి నియోజకవర్గంలో పేదల కోసం 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశాం. తొలి ఏడాదిలోనే మొత్తం 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాం. ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాం. ఇన్ని పథకాలు, హామీలు ఎలా అమలు చేయగలుగు తున్నారని ఇతర రాష్ట్రాల నేతలు అడుగుతున్నారు. ఈ రాష్ట్రంలో పుట్టడం అదృష్టంగా ప్రజలు భావించే పరిస్థితులు ఉండాలని భావించాం. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి వర్తించేలా రూ.5 లక్షలతో ఇందిరమ్మ బీమా పథకం తీసుకొచ్చాం. రైతు కుటుంబాల నుంచి వచ్చిన మాకు పేదల కష్టాలు, అవసరాలు తెలుసు. ప్రజల సంక్షేమం తప్ప.. మాకెవరికీ వ్యక్తిగత ప్రయోజనాలు లేవని భట్టి విక్రమార్క అన్నారు.

## బాసర జ్ఞానసరస్వతి ఆలయ విస్తరణ

- » 225 కోట్లతో అధునాతనంగా పునర్నిర్మాణం
- » ఆధునీకరణ పనులకు సిఎం రేవంత్ శంకుస్థాపన
- » ఆలయంలో ప్రత్యేక పూజల నిర్వహణ
- » మనవడికి అక్షరాభ్యాసం చేయించిన సిఎం




**నిర్మల్,ఏప్రిల్6 :**

నిర్మల్ జిల్లా బాసరలోని జ్ఞాన సరస్వతి దేవాలయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు సీఎంకు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం.. మనవడికి అక్షరాభ్యాసం చేయించారు. తర్వాత ఆలయ విస్తరణ అభివృద్ధి పనులకు సీఎం భూమిపూజ చేశారు. రూ.225 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. బాసరలోని జ్ఞాన సరస్వతి దేవాలయాన్ని పునరభివృద్ధి చేసేందుకు మాస్టర్‌ప్లాన్ రూపొందించారు.




## భూమిలో నీరు ఇంకితేనే సేద్యానికి సాధ్యం

- » నీటి బొట్టు విలువ ప్రతి ఒక్కరూ గ్రహించాలి
- » నీటి భద్రతలో రైతులు భాగస్వామ్యం కావాలి
- » గతంలో ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు చేపట్టాం
- » మైక్రో ఇరిగేషన్‌లో రూ.1,031 కోట్లు ఖర్చు చేస్తున్నాం
- » 'నీటి భద్రత- సాగునీటి సంఘాల బాధ్యత'లో సిఎం చంద్రబాబు
- » మావిగన్ పేరుతో అమరావతిని అడ్డుకునే కుట్రలు అంటూ విమర్శలు

**అనంతపురం,ఏప్రిల్ 6**

బ్యాంక్‌లో నగదు దాచుకున్నట్లు మనం నీటిని భూమిలో దాచుకోవాలని రాష్ట్ర ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. నీటి బొట్టు విలువ ప్రతి ఒక్కరూ గ్రహించాలని సీఎం చంద్రబాబు కోరారు. భూమినే ఒక జలాశయంగా మార్చుకోవాలన్నారు. అనంతపురం జిల్లా యాడికిలో చంద్రబాబు పర్యటించారు. 'నీటి భద్రత- సాగునీటి సంఘాల బాధ్యత' కార్యక్రమంలో పాల్గొన్నారు. సాగునీటి సంఘాలు, రైతులతో సమావేశమయ్యారు.



## ప్రజారోగ్యంపై వాకథాన్ జెండా ఊపిన మంత్రి దామోదర

**హైదరాబాద్,ఏప్రిల్ 6**

శారీరకంగా ఆరోగ్యంగా ఉంటేనే మానసికంగా దృఢంగా ఉండగలమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం ఆరోగ్య వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ మేరకు పీవీ మార్గ్ జలవిహార్ నుంచి హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వరకు ఏర్పాటు చేసిన వాకథాన్‌ను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. వాకథాన్‌లో పాల్గొన్న వారితో కలిసి మంత్రి జలవిహార్ నుంచి హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వరకు నడిచారు. కార్యక్రమంలో హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తమ జీవితంలో వ్యాయామాన్ని భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ వారం రోజుల పాటు ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నట్టు వివరించారు.

## ఆరు గ్యారెంటీలపై గ్రామాలకు వెళితే తెలుస్తుంది

- ఏ మేరకు అమలు చేశారు ప్రజలను అడగండి
- కేరళకు వెళ్లి అబద్దాలు ప్రచారం చేయడం కాదు
- మాజీమంత్రి జగదీశ్ రెడ్డి విమర్శలు



**నల్లగొండ,ఏప్రిల్6 :**

కేరళం రాష్ట్రంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లి గొప్పలు చెప్పడం తప్పు, అక్కడ రేవంత్‌ను చూసి ఓటేసేదెవరిన మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి అన్నారు. రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తి స్థాయిలో అమలయ్యాయని నిరూపించగలరా అని సవాల్ చేశారు. శాసనసభలో బీఆర్ఎస్ సభ్యులు ప్రజలకు ఇచ్చిన హామీలపై సర్కారును ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ధ్వజమెత్తారు. సీఎం స్థాయిని రేవంత్‌రెడ్డి దిగదార్చేలా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవిష్యత్తును అభాసుపాలు చేస్తున్న రేవంత్‌రెడ్డి ఎక్కవ కాలం ప్రజల్లో నిలువలేరని అన్నారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లి రేవంత్ మన పరువు తీస్తున్నారని విమర్శించారు. గ్రామాల్లో తిరిగి తాము ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఎలా అమలు చేస్తున్నామో ప్రజలను అడిగితే చెబుతారని అన్నారు.

2 లో

## కెసిఆర్ కార్యాలయంపై దాడి

**- గజ్వేల్ బంద్‌తో మూతపడ్డ దుకాణాలు**

**గజ్వేల్,ఏప్రిల్6 :**

గజ్వేల్‌లో బంద్ ప్రశాంతంగా కొనసాగుతోంది. వ్యాపారులు స్వచ్ఛందంగా షాపులను మూసివేశారు.




## బంజారాలకు పార్టీలో తగిన ప్రాధాన్యం

### మాజీ ఐపిఎస్ డిటి నాయక్‌తో కవిత భేటీ

**హైదరాబాద్,ఏప్రిల్6 :**

ఈనెల 25న కొత్త రాజకీయ పార్టీ ప్రకటించబోతున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అందుకు తగినట్లుగా వ్యూహాలు రచిస్తున్నారు.




## పాతబస్తీలో ఒక రూల్.. ఇతర ప్రాంతాల్లో మరొకటా?: బండి సంజయ్

**హైదరాబాద్:**

పశ్చిమబెంగాల్‌లో సీఎం మమతా బెనర్జీ పాలన వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలిగిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. చొరబాటుదార్ల ఓట్లతో గెలవాలని ఆమె కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని బెంగాలీలతో బండి సంజయ్ సమావేశమయ్యారు.



# బాసర జ్ఞానసరస్వతి ఆలయ విస్తరణ

మొదటిపేజీ తరువాయి
ఈ ప్లాన్‌లో ఆలయ రీడెవలప్‌మెంట్ నమూనాలోని ఒక భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసింది. దక్షిణ భారతదేశంలోని ఏకైక జ్ఞాన సరస్వతి ఆలయం.. అక్షరాభాస్యాలకు ఆలవాలమైన క్షేత్రం పునఃనిర్మాణంతో కొత్త శోభను సంతరించుకోబోతోంది. వేద వ్యాస మహర్షితో ప్రతిష్ఠతమైన ముగ్గురు అమ్మల ఆలయం ఆచారాలకు అనుగుణంగా సమున్నతమైన రాజగోపురం.. కోనేరు.. ఉత్తర ద్వారం అభివృద్ధి.. ధ్యాన మందిరాలతో మరింతగా భక్తుల మనస్సులను ఆకట్టకోనుంది. వేల ఏళ్ల ఘన చరిత్ర గల్గిన బాసర జ్ఞాన సరస్వతి ఆలయ పునః నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.225 కోట్లను కేటాయించింది. పునః నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సోమవారం భూమి పూజ చేసారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు,కొండా సురేఖ, ఎంపి గోడం నగేశ్, స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. దక్షిణ గంగగా గుర్తింపు పొందిన పవిత్ర గోదావరి నదీ తీరంలోని బాసర క్షేత్రంలో జ్ఞాన సరస్వతి దేవి కొలువై ఉన్నారు.. కురుక్షేత్ర యుద్దానంతరం ప్రశాంతత కోసం వేద వ్యాస మహర్షి గోదావరి తీరానికి వచ్చి బాసరలో నివసించారని ప్రశస్తి. ఆ సమయంలో స్వయంగా ఆయనే గోదావరి ఇసుకతో జ్ఞాన సరస్వతితో పాటు మహాలక్ష్మి, మహాకాళి అమ్మవార్ల మూర్తులను ప్రతిష్టించారనేది స్థల పురాణం.. అలా ముగ్గురమ్మల కొలువైన క్షేత్రంగా బాసర ప్రసిద్ధి చెందింది. జ్ఞాన సరస్వతి కొలువైన క్షేత్రం కావడంతో ప్రతి ఏటా పెద్ద సంఖ్యలో పిల్లలకు ఇక్కడ అక్షరాభ్యాసాలు చేయిస్తుంటారు. వసంత పంచమి, ఇతర పర్వ దినాల్లో అక్షరాభ్యాసాలకు వచ్చే పిల్లలు, తల్లిదండ్రులు, వారి బంధువులు, భక్తులతో ఆలయం కిటకిటలాడుతుంది. ప్రాచీన ఆలయం కావడం.. ఏటేటా పెరుగుతున్న భక్తుల సంఖ్యకు తగినట్లు అభివృద్ధి పనులు చేపట్టపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.. ఈ నేపథ్యంలో బాసర ఆలయ అభివృద్ధి చేపట్టాలని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారు. సంప్రదాయాలు, ఆచారాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి పనులు చేపట్టేందుకు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బాసర ఆలయ పునఃనిర్మాణ పనులకు మాస్టర్ ప్లాన్ రూపొందించే ముందు అధికారులు శృంగేరి పీఠాధిపతులతో సంప్రదించారు.. గర్భాలయం, అర్ధ మండపం, రాజగోపురం, ఇతర గోపురాలు, మాడ వీధులు, కోనేరు, ఉత్తర ద్వారాల నిర్మాణాలకు సంబంధించి పీఠాధిపతుల అనుమతులు తీసుకున్నారు.. వారి సూచనలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. భక్తుల సంఖ్య.. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం 2 వేల చదరపు అడుగుల్లో ఉన్న గర్భాలయం, అర్ధ మండపాన్ని 5 వేల చదరపు అడుగులకు పెంచుతున్నారు. ఉత్తరం వైపున 9 అంతస్తుల రాజగోపురం, మిగిలిన మూడు దిక్కుల్లో 7 అతంస్తుల గోపురాలు, 33 అడుగుల వెడల్పుతో నాలుగు దిక్కుల మాడ వీధులు, ఉత్తర ద్వారం నిర్మించనున్నారు. మొత్తంగా ఆలయ విస్తీర్ణాన్ని 20 వేల చదరపు అడుగుల నుంచి 62 వేల చదరపు అడుగులకు పెంచుతున్నారు. ఆలయంలో ప్రతి నిర్మాణాన్ని శిలలతో చేపట్టనున్నారు. 6 వేల మంది భక్తులకు అన్ని వసతులతో 70 వేల చదరపు అడుగులతో క్యూ కాంప్లెక్స్‌లు, 200 మంది ఏకకాలంలో కూర్చొని ధ్యానం చేసుకునేలా ధ్యాన మందిరం, 20 వేల చదరపు అడుగుల వైశాల్యంతో వంటశాల, భోజన శాలలు, ప్రసాద పంపిణీ కేంద్రం, ఈశాన్య దిక్కున కోనేరు తూర్పు దిక్కున ఆధ్యాత్మికత పరిఢవిల్లేలా అద్భుతమైన తోరణాలు, సమాచార కేంద్రం, దేవాలయానికి ఉత్తర, తూర్పు దిక్కుల్లో రోడ్ల అభివృద్ధి, దేవాలయం నుంచి ఆవతలి వైపు వెళ్లేందుకు అండర్ పాస్, ఆవతలి వైపున సోలార్ రూఫ్‌టాప్‌తో వాహనాల
పార్కింగ్, దేవాలయ ప్రాంగణంలో ఆహ్లాదకరమైన మొక్కలతో పుష్పవనం పనులు చేపట్టనున్నారు. ఆలయ ప్రాంగణం ఆవల హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు.. భవిష్యత్‌లో ఆలయం వెనుక భాగం భారీ వృక్షాలతో ఆలరారేలా మొక్కలు నాటనున్నారు.. గోదావరి నది పుష్కరాలు వచ్చే ఏడాది జూన్ లో ప్రారంభంకానున్నాయి. పుష్కరాల సమయంలో లక్షలాది మంది భక్తులు పుణ్య స్నానాలకు బాసర గోదావరి తీరానికి చేరకుంటారు. వారికి అవసరమైన అన్ని వసతులు ప్రస్తుత మాస్టర్‌ఎ÷–లాన్‌లో భాగంగా చేపట్ట నున్నారు. ఏ ఒక్క భక్తుడు ఇబ్బంది పడకుండా అదే సమయంలో ఆలయ సంప్రదాయాలు, భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

# ఆరు గ్యారెంటీలపై గ్రామాలకు వెళితే తెలుస్తుంది

మొదటిపేజీ తరువాయి
ప్రధాన అంశాలైన గవర్నర్ ప్రసంగం, బడ్జెట్ పద్దులపై చర్చలు నడుస్తున్న సమయంలో సీఎం రేవంత్ ఎన్నికల ప్రచారానికి వెళ్లాడని వివరించారు. గజ్వేల్‌లోని మాజీ సీఎం కేసీఆర్ క్యాంపు ఆఫీసుపై చేసిన దాడి ప్రభుత్వ కార్యాలయంపై దాడేనన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వెల్లడించారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని ఓర్వలేని కాంగ్రెస్, బీజేపీలు కేసీఆర్‌పై బురజల్లే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ మంత్రి పార్లమెంట్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుపై నెగెటివ్‌గా మాట్లాడారని, ఆయనకు తన శాఖపై పూర్తి అవగాహన లేదన్నారు. స్టేషన్ ఘన్‌పుర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏ పార్టీలో ఉన్నాడో ఆ నియోజకవర్గ ప్రజలతో రెఫరెండం పెట్టిస్తే తెలుస్తుందన్నారు. బయటకు వస్తే కాంగ్రెస్ అంటూ, విచారణ జరిపితే ఎమ్మెల్యే పదవి పోతుందని బీఆర్ఎస్‌లో ఉన్నానని కడియం శ్రీహరి చెప్పడం ఊసరవెల్లి రాజకీయాన్ని తలపిస్తున్న దన్నారు. మేడారం జాతరలో నాసిరకం పనులు చేయడంతోనే రెండు టన్నుల బండరాయి బాలుడి కాలుపై పడి తీవ్ర గాయాలవడంతో వైద్యులు ఆపరేషన్ చేసి కాలు తొలగించారని అన్నారు. ప్రమాదాలపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులైనవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో భూగర్భ జలాలు సమృద్ధి ఉంటే కాంగ్రెస్ పాలనలో అడుగంటుతున్నాయని, దీంతో వ్యవసాయ బావుల్లో రైతులు పూడిక తీస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో నడిచేది ప్రజాపాలన కాదని, ప్రజాపీడిత పాలన అని ఆయన ఆరోపించారు. తెలంగాణలో ఫ్యాక్ష న్ రాజకీయాలు, దాడులకు సీఎం రేవంత్‌రెడ్డి పాల్పడుతున్నాడని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై నిలదీస్తుంటే దిక్కుతోచని స్థితిలో కాంగ్రె స్ దాడులకు తెగబడుతున్నదన్నారు. హామీలు మరిచి దాడులతో డైవర్షన్, కరప్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని ఆరోపించారు. ఫ్యాక్షన్ రాజకీయాలు చేసే వారికి ఎలా బుద్ధి చెప్పాలో తెలంగాణ ప్రజానికానికి తెలుసని ఆయన పేర్కొన్నారు.

# ఆదిలాబాద్,కు గోదావరి నీరు పారిస్తా

మొదటిపేజీ తరువాయి
మేం పార్టీలు చూడకుండా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నాం అని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో రాజకీయాలు చూడటం లేదు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వలేదు. కానీ మేం పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటికే రూ.5,400 కోట్లు పేదల ఖాతాల్లో వేశాం. సన్నబియ్యంతో పేదల కడుపు నింపాలనే ఆలోచన గత పాలకులకు వచ్చిందా అని ప్రశ్నించారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలు అమాయకులే కాదు. నిరంకుశత్వం మీద పోరాడిన వీరులు. కుమురంభీం వంటి ఆదివాసీ వీరులు నిజాం నిరంకుశత్వంపై పోరాడారు. ఆదిలాబాద్ జిల్లాకు ఆధునిక విద్య, వైద్యం వంటి సదుపాయాలు ఇంకా దక్కలేదు. ఎన్నో ఒత్తిళ్లు, బెదిరింపులు తట్టుకొని కాంగ్రెస్ కార్యకర్తలు పోరాడారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలను శత్రువులుగా చూసే ప్రభుత్వం కాదు ఇది. రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం ఇస్తున్న రాష్ట్రం.. దేశంలో మరొకటి లేదు. యువత మత్తుబాట వదిలి.. మైదానాల బాట పట్టాలని ప్రయత్నం చేస్తున్నాం. ఆదాయం పెంచాలి.. పేదలకు పంచాలి అనే ఆశయంతో ఈ ప్రభుత్వం పని చేస్తోందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు,కొండా సురేఖ, ఎంపి గోడం నగేశ్, స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# భూమిలో నీరు ఇంకితేనే సేద్యానికి సాధ్యం

మొదటిపేజీ తరువాయి
వర్షపు నీటి విలువ రాయలసీమ రైతులకు బాగా తెలుసని అన్నారు. నీటిని సంరక్షించుకోవడానికే వంద రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టామని స్పష్టం చేశారు. పరిగెత్తే నీటిని నిలబెట్టాలి.. నిలబడిన నీటిని నిల్వ చేయాలి.. జలాశయాలు నింపేందుకు ప్రయత్నించాలన్నారు. ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు, తుంపర సేద్యం, సూక్ష్మసేద్యం వంటివి గతంలో చేపట్టామని చంద్రబాబు వివరించారు. నీటి కుంటలు, కాలువలు, చెరువుల్లో మట్టి తీసి పొలాల్లో వేశామని ఏపీ సీఎం గుర్తు చేశారు. నీటి భద్రతా కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని రైతులు, సాగునీటి సంఘాలకు సూచించారు. మైక్రో ఇరిగేషన్‌లో తాము చేసింది.. దేశం మొత్తం అనుసరించిం దని అన్నారు. ప్రస్తుతం మైక్రో ఇరిగేషన్‌లో రూ.1,031 కోట్లు ఖర్చు చేస్తూ దేశంలో నంబర్ వన్‌గా ఉన్నామన్నారు. గతంలోనే ఇంకుడుగుంతలు, పంటకుంటలు తవ్వించాం. ఎన్టీఆర్ జలసిరి, నీరు–మీరు, నీరు ప్రగతి తీసుకువచ్చాం. మైక్రో ఇరిగేషన్‌లో దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్నాం. రాయలసీమలో 63 శాతం పంటలను మైక్రో ఇరిగేషన్ కిందికి తీసుకొచ్చాం. మైక్రో, డ్రిప్ ఇరిగేషన్ వల్ల రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌గా తయారైంది. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తి చేస్తాం. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తాం. రాష్ట్రంలోని జలాశయాలన్నీ జలకళ సంతరించుకున్నాయి. నీటిని నిల్వ చేసుకుంటే చాలు.. అదే సంపద సృష్టిస్తుందని చంద్రబాబు అన్నారు. గత ఏడాది వేసవి ముందు 8, వేసవి తర్వాత 3 మీటర్ల మేర భూగర్భ జలాలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో గతంలో 13 మీటర్ల మేర ఉంటే.. ప్రస్తుతం అవి 11 మీటర్లే ఉన్నాయని తెలిపారు. వర్షాకాలం కంటే ముందు 6 మీటర్ల లోతు, ఆ తర్వాత 3 మీటర్ల కంటే తక్కువగా నీరు చూడాల్సి ఉందని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. అలా చేయగలిగితే రాష్ట్రంలో నీటి ఎద్దడి అనేది ఉండదన్నారు. రాయలసీమలోనూ ప్రతీ ఎకరాకు నీరు ఇచ్చే బాధ్యత తనదని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక్క ఖరీఫ్‌కు 547 టీఎంసీలు, రబీకి 343 టీఎంసీలు నీరు అవసరమవుతుందని సీఎం చంద్రబాబు తెలిపారు. పరిశ్రమలకు 28, తాగు నీటికి 158 టీఎంసీల చొప్పున మొత్తంగా 1,300 టీఎంసీల వరకూ మనకు అవసరం అవుతాయని వివరించారు. ఈ ఏడాదిలో 74 టీఎంసీల నీరు అనంతపురం వరకూ తీసుకు వచ్చామని ఆయన గుర్తు చేశారు. గత పాలకులు మనకు అడ్రస్ లేకుండా చేశారంటూ వైసీపీపై సీఎం చంద్రబాబు నిప్పులు చెరిగారు. ఇప్పుడు మీ రాజధాని ఏదంటే అమరావతి అని గర్వంగా చెప్పే రోజు వచ్చిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గతంలో రాజధాని విషయంలో మూడు ముక్కలాట ఆడారని.. ఇక మనకు ఒక్కటే రాజధాని నగరం అని పేర్కొన్నారు. మావిగన్ అంటూ పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని వైకాపాపై సీఎం చంద్రబాబు విరుచుకుపడ్డారు. వారికి మావిగన్ పిచ్చి ముదిరిందని మండిపడ్డారు. రాష్ట్రంపై పగబట్టారు.. ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. అమరావతి దేవతల రాజధాని.. పేరు పలికితే పుణ్యం వస్తుంది. అమరావతి పేరు పలకడం ఇష్టం లేకపోతే ఇంట్లోనే ఉండండి. రాష్ట్రానికి ఒకే రాజధాని.. అది అమరావతి అని సీఎం స్పష్టం చేశారు. పార్లమెంటులో 50 పార్టీలు ఉంటే అందులో వైసీపీ మినహా 49 పార్టీలు రాజధాని అమరావతికి మద్దతు పలికాయని సీఎం చంద్రబాబు వివరించారు. ఒక్క దిక్కు మాలిన వైసీపీ మాత్రమే రాష్ట్రానికి ద్రోహం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిచ్చి ముదిరి మావిగన్ అనే పేరు తెరపైకి తెచ్చారని వైసీపీ అధినేతపై సీఎం చంద్రబాబు మండిపడ్డారు. రాజధాని అమరావతి అని పలకడానికి కూడా ఇష్టం లేని వ్యక్తులు మావిగన్ అంటున్నారని సీఎం చంద్రబాబు వ్యంగ్యంగా అన్నారు. బాబాయిని చంపి తన చేతిలో కత్తి పెట్టిన వాళ్లు ఎలాంటి రాజకీయమైనా చేస్తారంటూ వైసీపీ నేతల వైఖరిని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఎండగట్టారు. రాజధాని అమరావతి పనులు వేగంగా జరుగుతుంటే.. అవి చూసి సహించలేకే ఈ విమర్శలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు, ఉద్యోగాలు వస్తుంటే ఓర్వలేకపోతున్నారని వైసీపీ నేతల తీరుపై ఏపీ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడబిడ్డల జోలికి వస్తే వారికి అదే చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. దేవాలయాలపై దాడులు చేసి తిరిగి ప్రభుత్వంపై ఎదురుదాడి చేస్తున్నారంటూ వైసీపీ నేతల తీరుపై మండిపడ్డారు. తిరుమలలో శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ నెయ్యితో ఘోర అపచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జలధారతో ప్రతి ఎకరానికీ జలహారతి ఇచ్చేలా కార్యాచరణ చేపడదామని ప్రజలకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# కెసిఆర్ కార్యాలయంపై దాడి

మొదటిపేజీ తరువాయి
ఆర్టీసీ బస్సులన్నీ డిపోకే పరిమితమయ్యాయి. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. బంద్ సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుపై దాడి చేయడం దుర్మార్గమని తెలిపారు. ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్‌కు దాడుల సమాచారం ఉందా? లేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు హామీలపై దృష్టి సారించాలని సూచించారు. హామీలను మరిచి ప్రతిపక్షాలపై దాడులు చేయడమేంటని వంటేరు ప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులంతా వారి ఆఫీసుల్లో మోదీ ఫొటో పెట్టారా అని నిలదీశారు. బీజేపీ ఎమ్మెల్యేల ఆఫీసుల్లోనూ సీఎం ఫొటో పెట్టిస్తారా అని ప్రశ్నించారు. గజ్వేల్ ఎమ్మెల్యే అధికార కార్యాలయం పై కాంగ్రెస్ శ్రేణుల దాడికి నిరసనగా గజ్వేల్‌లో బంద్ ప్రశాంతంగా కొనసాగుతోంది. బీఆర్ఎస్ శ్రేణుల పిలుపు మేరకు గజ్వేల్ ప్రజ్ఞాపూర్‌లో స్వచ్ఛందంగా బంద్ పాటిస్తున్నారు. గజ్వేల్ బంద్‌లో భాగంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో ముందు బీఆర్ఎస్ శ్రేణులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ నిరసనలో గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి, ఇతర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# పాతబస్తీలో ఒక రూల్.. ఇతర ప్రాంతాల్లో మరొకటా?: బండి సంజయ్

మొదటిపేజీ తరువాయి
వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో భాజపాకు ఓటు వేయాలని కోరారు.“బంగ్లాదేశ్ చొరబాటుదారులకు మమత రెడ్ కార్పెట్ పరుస్తున్నారు. పాతబస్తీలోనూ బెంగాలీ కుటుంబాలు ఉండలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వేలాది మంది హైదరాబాద్ వచ్చారు. రోహింగ్యాలకు రేషన్ కార్డులు, ఓటర్ కార్డులిచ్చి రెడ్ కార్పెట్ పరిచారు. పాతబస్తీలో అక్రమ నిర్మాణాలను కూల్చేందుకు వెళ్లిన జీహెచ్ఎంసీ అధికారులు, పోలీసులపై మజ్లిస్ ఎమ్మెల్సీ, నాయకులు అడ్డుకొని దౌర్జన్యం చేసినా చర్యలు తీసుకోలేదు.

ఆ పార్టీతో సీఎం రేవంత్‌రెడ్డి అంటకాగుతున్నారు. హైడ్రా పేరుతో ఇళ్లు కూలుస్తుంటే.. అడ్డుకున్న భాజపా కార్యకర్తలపై, పేదలపై లాఠీ ఛార్జ్ చేసి కేసులు పెట్టారు. పాతబస్తీలో మాత్రం అక్రమ నిర్మాణాలు కూలుస్తున్న అధికారులపై దాడులు చేస్తున్నా కనీసం ఒక్క కేసు కూడా లేదు. పాతబస్తీలో ఒక రూల్.. ఇతర ప్రాంతాల్లో మరో రూల్ అమలు చేస్తారా? పాతబస్తీలో అధికారులు, పోలీసులపై జరుగుతున్న దాడులపై సీఎం వెంటనే స్పందించాలి. లేనిపక్షంలో పరిస్థితులు అదుపు తప్పే ప్రమాదముంది” అని బండి సంజయ్ అన్నారు.

# నేచర్ క్యూర్‌లో ఈట్ రైట్ మేళా పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ

ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పోషకాహారంపై ట్రైనింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేళాలో సోమవారం సాయంత్రం మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. ఉదయం 10 గంటల నుంచి బల్కంపేటలోని నేచర్ క్యూర్ హాస్పిటల్‌లో ఈట్ రైట్ మేళాను నిర్వహించారు. ఈట్ రైట్ మేళాలో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను మంత్రి సందర్శించారు. నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలతో పలువురు ఫుడ్ వెంటర్స్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. మి÷–లలెట్లతో తయారు చేసిన ఆహార పదార్థాలతో ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మి÷–లలెట్స్‌తో తయారు చేసిన ఐస్ క్రీమ్, కాఫీ, తదితర పదార్థాలను మంత్రి రుచి చూసి, తయారీ పద్ధతిని అడిగి తెలుసుకున్నారు. పాలు, పండ్లు, కాయగూరలు, మసాల దినుసులు, చిరుధాన్యాలు, టీ పౌడర్ , పప్పు దినుసుల్లో కల్తీని ఎలా గుర్తించాలో తెలుపుతూ ఫుడ్ సేఫ్టీ అధికారులు స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఆహార పదార్థాల్లో జరిగిన కల్తీని ఎలా గుర్తించాలో, ఫుడ్ సేఫ్టీ అధికారులు, సైంటిస్టులు మంత్రికి వివరించారు. ఆయా పద్ధతులను ప్రజల్లోకి తీసుకెళ్లి, వారికి అవగాహన కలిగేలా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి సూచించారు. ఇప్ప పువ్వుతో లడ్డులు, ఇతర ఆహార పదార్థాలను తయారు చేసి.. సక్సెస్‌ఫుల్‌గా బిజినెస్ రన్ చేస్తున్న మహిళా సంఘం సభ్యురాలిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. స్టాళ్ల సందర్శన అనంతరం జరిగిన సభలో స్ట్రీట్ ఫుడ్ వెండర్స్‌కు మంత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు అందించారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తూ, ఆహార నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్న పలు హోటళ్లు, రెస్టారెంట్ల ప్రతినిధులకు హైజీన్ సర్టిఫికెట్లను మంత్రి అందజేశారు. ఫుడ్ సేఫ్టీ – న్యూట్రీషియన్ ఫుడ్ ట్రైనింగ్‌లో పాల్గొన్న వారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఏం తినాలో, ఎంత తినాలో తెలుసుకోవడం ఎంత ముఖ్యమో, మనం తింటున్న ఆహార నాణ్యత గురించి తెలుసుకోవడం కూడా అంతే ముఖ్యం అని పేర్కొన్నారు. ‘మంచి ఆహారపు అలవాట్ల గురించి, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాల గురించి తెలుసుకోవడానికి ఈట్ రైట్ మేళా వంటి కార్యక్రమాలు ఇందుకు ఎంతో దోహదపడుతాయి. ఆరోగ్యం బాగున్నప్పుడే, జీవితం ఆనందంగా ఉంటుందన్న విషయాన్ని బిజీ లైఫ్‌లో పడి మనం మర్చిపోతున్నాం. డబ్బు, ఉద్యోగం, సౌకర్యాలు అన్నీ ఉన్నా? ఆరోగ్యం లేకపోతే వాటికి విలువ ఉండదు. ఇటీవలి కాలంలో మన ఆహారపు అలవాట్లు మారిపోయాయి. బయట ఆహారం, ప్రాసెస్డ్ ఫుడ్ వినియోగం పెరిగింది. దీంతో పాటు, శారీరక శ్రమ, ఫిజికల్ యాక్టివిటీ తగ్గిపోయింది. ఇది ఆందోళన కలిగించే విషయం. రోజూ కనీసం 30 నిమిషాలైనా వ్యాయామం చేయడం చాలా అవసరం. వాకింగ్, యోగా, గేమ్స్... ఏదైనా ఒకటి మన నిత్య జీవితంలో భాగం కావాలి. శరీరం కదిలితేనే ఆరోగ్యం బాగుంటుంది. శారీరక ఆరోగ్యం మాత్రమే కాదు.. మానసిక ప్రశాంతత కూడా అంతే ముఖ్యమైనది. ఈ రోజుల్లో ఒత్తిడి, ఆందోళన ఎక్కువవుతున్నాయి. సమయానికి తినకపోవడం, నిద్రలేమి, వ్యాయామం లేకపోవడం వంటివన్నీ మన మనసుపై కూడా ప్రభావం చూపుతున్నాయి. సరైన ఆహారం, వ్యాయామం, మంచి నిద్ర ఉంటేనే మనిషి సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారు. ఈ పరిస్థితుల్లో, ‘ఈట్ రైట్‘ అనే భావన చాలా కీలకం. మనము తినే ఆహారమే, మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది కాబట్టి, ఏం తినాలో, ఎక్కడ తినాలో ప్రజలు తెలుసుకోవాలి. వీలైనంత వరకూ ఇంట్లో వండిన ఆహార పదార్థాలనే తినడం మంచిది. ఆహారంతో పాటు ప్రతిరోజు వ్యాయామం చేయాలి, మనసుకు ప్రశాంతత కలిగించే జీవనశైలిని అలవరచుకోవాలి. ఆహార కల్తీ జరుగుతున్నట్టు మీ దృష్టికి వస్తే, వెంటనే పోలీసులకు లేదా ఫుడ్ సేఫ్టీ అధికారులకు లేదా ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం ఇవ్వండి. తక్షణమే కఠిన చర్యలు తీసుకునే బాధ్యత మాది.‘ అని మంత్రి ప్రజలకు సూచించారు.

# బంజారాలకు పార్టీలో తగిన ప్రాధాన్యం

మొదటిపేజీ తరువాయి
అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ మేరకు ఇటీవల సింగరేణి కార్మికులతో భేటీ అవ్వగా తాజాగా సోమవారం బంజారా నేతలను కలిశారు. రిటైర్డ్ అడిషనల్ డీజీ డీటీ నాయక్ సహా పలువురు బంజారా ప్రముఖులతో కవిత భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని డీటీ నాయక్ నివాసానికి వెళ్లిన కవిత మర్యాద పూర్వకంగా వారితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా తన కొత్త రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వాలని కవిత వారిని కోరారు. పార్టీ ఏర్పాటు నేపథ్యంలో బంజారా సమాజం కోసం ఏం చేయాలనే దానిపై వారితో కూలంకషంగా ఆమె చర్చించారు. ఆ సామాజిక వర్గానికి ఏం చేయాలో అడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే బంజారాలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడం ఇదే మొదటిసారి అని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఏర్పాటు చేయబోయే పార్టీలో వారికి సముచిత అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు బంజారా ప్రముఖులంతా తాము ఏర్పాటు చేయబోయే పార్టీకి సలహాలు, సూచనలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశించాలనుకునే వారిని తమ పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు.

# అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ జారీ

- నిరంతరం అక్రిడిటేషన్ దరఖాస్తుల పక్రియ
- సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్.ప్రియాంక

జర్నలిస్టుల అక్రిడిటేషన్ దరఖాస్తుల పక్రియ నిరంతరం కొనసాగుతుందని సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల పక్రియపై ఇటీవల మీడియాలో వస్తున్న వార్తలపై జర్నలిస్టులు ఎటువంటి ఆందోళన చెందవద్దని కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను ఈ నెల 10వ తేదీన జరిగే రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో స్క్రూటీని చేసి అర్హులైన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేస్తూ నూతన కార్డులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన జర్నలిస్టు ఆన్‌లైన్ లో తమ దరఖాస్తులను అప్లోడ్ చేసుకోవాలని, ఏప్రిల్ మాసంలో అక్రిడేషన్ జారీ పక్రియ పూర్తి చేయడం జరుగుతుందని, కమిషనర్ సిహెచ్. ప్రియాంక ప్రకటనలో తెలిపారు. అదేవిధం జిల్లా స్థాయిలో కూడా ఈనెలలోనే జిల్లా కమిటీలు సమావేశాలు ఏర్పాటు చేసి అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ లు జారీ చేయడం జరుగుతుందని అన్నారు. కావున జిల్లాలో జిల్లా స్థాయి దరఖాస్తు చేసుకొనే అర్హులైన జర్నలిస్టులు వెంటనే తమ దరఖాస్తులను ఆన్‌లైన్లో చేసుకోవాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం ఏప్రిల్ 7, 2026

# మరో కీలక మైలురాయి సాధించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

- చారిత్రక ఆలయానికి కేంద్రం నుంచి భారీ నిధులు
- ఎంపీ డా.కడియం కావ్య పట్టుదలతో కాకతీయుల వైభవానికి పునర్జీవం
- పలుమార్లు కేంద్ర మంత్రిని కలిసి విజ్ఞప్తి చేసిన ఎంపీ డా. కడియం కావ్య
- చివరకు ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు
- కేంద్ర మంత్రికి, పురావస్తు శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేసిన వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య





**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఏప్రిల్ 6**

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మరో కీలక మైలురాయిని సాధించారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన హనుమకొండలోని రుద్రేశ్వర స్వామి వేయి స్తంభాల గుడి అభివృద్ధి కోసం కేంద్రం నుంచి భారీ నిధులు మంజూరు కావడంలో ఎంపీ డా.కడియం కావ్య కృషి ఫలించింది. వేయి స్తంభాల ఆలయం, అదే ప్రాంగణంలోని కల్యాణ మండపం అభివృద్ధి, విస్తరణతో పాటు మిగిలిపోయిన పునరుద్ధరణ పనుల కోసం రూ.14.44 కోట్ల నిధులు మంజూరు చేయించడంలో ఎంపీ కడియం కావ్య కీలక పాత్ర పోషించారు. ఈ నిధులతో కాకతీయుల కాలం నాటి శిల్ప వైభవాన్ని తిరిగి తీసుకురావడమే లక్ష్యంగా పనులు చేపట్టనున్నారు. గతంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ని పలుమార్లు కలిసి, వేయి స్తంభాల గుడి అభివృద్ధి అవసరాన్ని వివరిస్తూ ఎంపీ చేసిన నిరంతర ప్రయత్నాలే ఈ ఫలితానికి కారణం అయ్యాయి.గతంలో పురావస్తు శాఖ అధికారులతో కలసి స్వయంగా ఆలయాన్ని సందర్శించి, పునరుద్ధరణ అవసరాలను అధ్యయనం చేసిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వెంటనే కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించారు.

ఇటీవల కేంద్ర పురావస్తు శాఖ పనులకు టెండర్లు పిలవడంతో పనులు ప్రారంభానికి రంగం సిద్ధమైంది. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో పాటు పురావస్తు శాఖ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి, ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. గత ఏడాది కేంద్ర మంత్రిని కలసి సుమారు రూ.15 కోట్ల నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేసిన విషయం గుర్తు చేస్తూ, అందుకు సానుకూలంగా స్పందించిన కేంద్రం రూ.14.44 కోట్లు కేటాయించడం వరంగల్ అభివృద్ధికి శుభసూచకమని పేర్కొన్నారు. కాకతీయుల శిల్ప కళా సంపదకు ప్రతీకగా నిలిచిన వేయి స్తంభాల గుడి అభివృద్ధి ద్వారా పర్యాటక రంగం మరింతగా అభివృద్ధి చెందడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య అన్నారు. "వారసత్వాన్ని కాపాడుతూ అభివృద్ధి" అనే లక్ష్యంతో ముందుకు సాగుతూ వరంగల్ లో నూతన ప్రాజెక్టుల సాధన కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వరంగల్ ఎంపీ డా.కడియం కావ్యకి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం







- పర్వతగిరి, ఏనుగల్లు లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే నాగరాజు

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఏప్రిల్ 6**

వరంగల్ జిల్లా, పర్వతగిరి మండలంలో రైతులకు తమ పంటకు సరైన ధర లభించేలా ప్రభుత్వం ముందస్తుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు తెలిపారు. వరంగల్ జిల్లా మార్క్‌ఫెడ్ సహకారంతో నేడు పర్వతగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో మరియు ఏనుగల్లు గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే నాగరాజు ప్రారంభించారు.ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం రైతుల పట్ల అనుకూల దృక్పథంతో పని చేస్తోందని తెలిపారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ..

రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించాలని సూచించారు. ఈ కేంద్రాల్లో మొక్కజొన్నకు క్వింటాల్‌కు రూ.2400 కనీస మద్దతు ధర లభిస్తుందని చెప్పారు. రైతులు ఎలాంటి అనుమానాలు లేకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు తమ పంటను తీసుకురావాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పంట తూకం, చెల్లింపులు, ఇతర ప్రక్రియలు పారదర్శకంగా, వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు మద్దతుగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. రైతు కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపర్చడం, పంటలకు సరైన ధర కల్పించడం, వ్యవసాయానికి అనుకూల విధానాలు అమలు చేయడం ద్వారా రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నాగరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మార్క్‌ఫెడ్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- బిజెపి జెండాను ఆవిష్కరించిన మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్





**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఏప్రిల్ 6**

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆవిర్భవించి 47 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా పార్టీ శ్రేణులు ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించాయి. సోమవారం గౌతమ్ నగర్ డివిజన్ లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ పాల్గొని బిజెపి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నెహ్రూ కుటుంబ ఆధిపత్యం కొనసాగుతున్న కాలంలో, అటల్ బిహారీ వాజ్ పాయి నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించినప్పుడు, ఈ పార్టీ రాజకీయంగా ఎదుగుతుందా? అధికారంలోకి వస్తుందా? అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే వాజపేయి అలాంటి విమర్శలను పట్టించుకోకుండా, దృఢ సంకల్పంతో పార్టీని ముందుకు నడిపించారన్నారు. ప్రారంభ దశలో కేవలం ఇద్దరు ఎంపీలతో పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ, ఆత్మవిశ్వాసం కోల్పోకుండా నిరంతర పోరాటం, కృషితో బీజేపీ అంచెలంచెలుగా ఎదిగింది. దేశ ప్రజల విశ్వాసాన్ని పొందుతూ, నేడు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య రాజకీయ పార్టీలలో ఒకటిగా అవతరించిందన్నారు. పార్టీ ఆశయాలను సాధించాలనే సంకల్పంతో ముందుకు సాగిన సమయంలో అనేక అవమానాలు, అనుమానాలు ఎదురైనా, వాజపేయి గారి దృఢ నిశ్చయం వాటిని అధిగమించేలా చేసింది. ఆయన ప్రసంగాలలో వినిపించిన "చీకటి పోతుంది, వెలుగు వస్తుంది, కమలం వికసిస్తుంది" అనే సందేశం దేశ ప్రజల్లో నమ్మకం నింపిందన్నారు.

ఈ సందర్భంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎంపీ ఈటెల రాజేందర్ ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ కే శ్రీనివాస్, గోపు రమణ రెడ్డి , వీకే మహేష్,డివిజన్ అధ్యక్షులు లక్ష్మణ్ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రిటైర్డ్ ప్రొఫెసర్ మహ్మద్ అన్సారీని పరామర్శించిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఏప్రిల్ 6**



హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ప్రాంతంలో ఉన్న వెల్‌నాక్స్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ మహ్మద్ అన్సారీ గారిని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.అన్సారీ గారి అనారోగ్యానికి దారితీసిన పరిస్థితులు, ప్రస్తుతం అందుతున్న చికిత్స వివరాలను వైద్యులు మరియు కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. అన్సారీ ప్రొఫెసర్‌గా, అంతకు ముందు విద్యార్థిగా ఉన్నప్పటి నుంచే వర్సిటీలో జరిగిన అక్రమాలను బయటపెట్టి, విద్యార్థుల హక్కుల కోసం పోరాడారని తెలిపారు. ప్రభుత్వ విధానాలపై కూడా ఆయన నిరంతరం పోరాటం చేశారని అన్నారు. 2023లో రిటైర్ అయినప్పటికీ ఇప్పటి వరకు ఆయనకు రిటైర్మెంట్ ప్రయోజనాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు చికిత్స కోసం క్రౌడ్ ఫండింగ్ చేయాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదని విమర్శించారు. ఇదే విధంగా దాదాపు 143 మంది ప్రొఫెసర్లు రిటైర్మెంట్ ప్రయోజనాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. కేవలం ప్రొఫెసర్లు మాత్రమే కాకుండా, రిటైర్ అయిన టీచర్లు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు కూడా తమకు రావాల్సిన ప్రయోజనాల కోసం సంవత్సరాలుగా వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొన్నదని అన్నారు. అర్హులైన వారికి రావాల్సిన రిటైర్మెంట్ ప్రయోజనాలను తక్షణమే అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఎదురుచూస్తున్న వారికి ప్రభుత్వం భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు.

# ఘనంగా భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- హంటర్ రోడ్ దీన్ దయాళ్ నగర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రావు పద్మ రెడ్డి



**కరపత్రం ప్రతినిది బ్యూరో, ఏప్రిల్ 6**

"దేశమే ప్రథమం.. పార్టీ తర్వాత.. స్వార్థం చివర" అనే నినాదమే ఊపిరిగా ముందుకు సాగుతున్న భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ హంటర్ రోడ్ లోని దీన్ దయాళ్ నగర్ చౌరస్తా (పోలింగ్ బూత్ నం. 112) వద్ద బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీమతి రావు పద్మ రెడ్డి పార్టీ పతాకాన్ని గర్వంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రావు పద్మ రెడ్డి మాట్లాడుతూ..భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించి నేటికి 46 వసంతాలు పూర్తి చేసుకుని 47వ పడిలోకి అడుగు పెట్టడం సంతోషదాయక మని అన్నారు. నిస్వార్థ సేవా దృక్పథంతో, అంకితభావంతో జాతి నిర్మాణానికి కృషి చేస్తున్న కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తనతో పాటు ఉత్సాహంగా పాల్గొన్న స్థానిక నాయకులకు, కార్యకర్తలకు ఆమె హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కడవేరు శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు దొంతి దేవేందర్ రెడ్డి, రావు అమరేందర్ రెడ్డి, జిల్లా నాయకులు నర్మెట్ట శ్రీనివాస్ రావు గౌడ్, ఆకుల శ్రీకాంత్ పటేల్, తోపుచెర్ల అర్చన మధుసూదన్ రావు, పిట్టల ధనలక్ష్మి, బొమ్మసాని అనిల్ యాదవ్, రత్నా లక్ష్మి, కే. సంపత్ రెడ్డి, కురిమిండ్ల సది, ఉషా రెడ్డి, చాంద్ పాషా, తిరుపతి రెడ్డి, ఆదిత్య సాయి, నిఖిల్ చోప్రా, హరీష్, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం-ఉచిత దంత వైద్య శిబిరం

**కరపత్రం ప్రతినిది బ్యూరో, ఏప్రిల్ 6**





ఆనంద్ బాగ్ క్రాస్ రోడ్డు,సన్ డెంటల్ హాస్పిటల్ వద్ద మల్కాజిగిరి డివిజన్ మాజీ కార్పొరేటర్ ఊరపల్లి శ్రవణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆవిర్భావ వేడుకలలో పాల్గొని అనంతరం ఉచిత మెగా వైద్య శిబిరం, దంత పరీక్షల కేంద్రాన్ని ఎంపీ ఈటల రాజేందర్ సందర్శించారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన రెనోవా హాస్పిటల్, సన్ డెంటల్ హాస్పిటల్ వారికి అభినందనలు తెలియజేసి, వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో వినాయకనగర్ డివిజన్, మాజీ కార్పొరేటర్ సీహెచ్. రాజ్యలక్ష్మి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.కే.శ్రీనివాస్, గోపు రమణారెడ్డి, మల్కాజిగిరి డివిజన్ అధ్యక్షులు సోమ శ్రీనివాస్, సీనియర్ నాయకులు వీ.కే. మహేష్, శ్రీ మహిపాల్ రెడ్డి, మేకల మోహన్ యాదవ్, పార్టీ నాయకులు , కార్యకర్తలు హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- 16వ డివిజన్ బిజెపి అధ్యక్షులు జాలిగాపు ప్రసన్న-రాంప్రసాద్ ఆధ్వర్యంలో..



**కరపత్రం ప్రతినిది బ్యూరో, ఏప్రిల్ 6**

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం ప్రతి సంవత్సరం ఏప్రిల్ 6న దేశ వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారు. 1980లో స్థాపితమైన ఈ పార్టీ, భారతీయ సంస్కృతి, జాతీయత, అభివృద్ధి అనే సిద్ధాంతాలతో ముందుకు సాగుతూ దేశ రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది. సోమవారం గ్రేటర్ వరంగల్ 16 డివిజన్ లో డివిజన్ అధ్యక్షురాలు జాలిగపు ప్రసన్న-రాంప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా అంగరంగ వైభవంగా జరిగాయి.ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి, బీజేపీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలను పరస్పరం తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా స్వీట్ పంపిణీ చేశారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ అభివృద్ధి కోసం ఐక్యంగా పనిచేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా గత కొన్ని సంవత్సరాల నుంచి పార్టీ కోసం పని చేస్తున్న సీనియర్ నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ గట్టికొప్పుల రాంబాబు జిల్లా కౌన్సిల్ మెంబర్ గోదాసి అశ్విని కుమార్ కుమార్, బిజెపి సీనియర్ నాయకులు ఆరే కుమార్, సుంకరి రాజు, డివిజన్ సీరియల్, పార్టీ ఆవిర్భావ కార్యక్రమ కన్వీనర్ బైకని వెంకటేష్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ల్యాద రాజేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సంకతాల శ్రీనివాస్, బొమ్మగాని దిలీప్, భూత అధ్యక్షులు పొలాబోయిన నవీన్, డివిజన్ నాయకులు బండారి నాగరాజు, బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# వంట గ్యాస్ ప్రమాదంలో గాయపడి మహిళ మృతి

**కరపత్రం ప్రతినిది వరంగల్,ఏప్రిల్ 6**



వరంగల్ నగరంలోని రామన్నపేటకు చెందిన పసునూటి జ్యోతి (45) అనే గృహిణి కాలిన గాయాలతో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం,ఈ నెల 23న జ్యోతి తన ఇంట్లో వంట చేసుకుంటుండగా టర్పెంటైన్ ఆయిల్ పాత్ర కింద పడడంతో మంటలు చెలరేగాయి.ఈ ప్రమాదంలో ఆమెకు ముఖం,ఛాతి భాగాల్లో తీవ్ర కాలిన గాయాలు అయ్యాయి.వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా,అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి మార్చారు. అయితే పరిస్థితి విషమించడంతో తిరిగి ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 7:40 గంటలకు ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న మట్టేవాడ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎంజీఎం మార్చురి గదికి చేరుకుని విచారణ చేపట్టారు.మృతురాలి సోదరుడు నిడిగొండ రాజేష్ ఫిర్యాదు మేరకు ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ నమోదు చేసి,మృతదేహానికి పంచనామా నిర్వహించారు.అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక

మంగళవారం ఏప్రిల్ 7, 2026

# సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా కామీశెట్టి రమేష్ నియామకం



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 6**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణ పరిధిలోని మోతుకులగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కామీశెట్టి రమేష్ ని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించడం జరిగింది. ఈ నియామకాన్ని సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్ మార్గదర్శకత్వంలో, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ విస్తరణలో భాగంగా చేపట్టారు.
ఈ సందర్భంగా స్థానికంగా కార్యకర్తలు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ రమేష్ కి అభినందనలు తెలిపారు. గ్రామ స్థాయి నుండి ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ, సామాజిక సేవలో ముందుండే నాయకుడిగా గుర్తింపు పొందిన రమేష్ కి ఈ పదవి రావడం పట్ల పలువురు ప్రశంసలు కురిపించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన చూపిన నిబద్ధత, పారదర్శకత పట్ల ఉన్న కట్టుబాటు కారణంగానే ఈ బాధ్యతలు అప్పగించినట్లు నేతలు పేర్కొన్నారు.
కామీశెట్టి రమేష్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్ కి, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవిని గౌరవంగా స్వీకరించి, సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు న్యాయం చేయడం, అవినీతిని వెలికితీయడం, ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత తీసుకురావడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.
అలాగే గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది ప్రజలకు సమాచార హక్కు చట్టంపై సరైన అవగాహన లేకపోవడం వల్ల వారు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, అలాంటి వారందరికీ ఈ చట్టంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. ప్రతి మండలం, ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యపరచడం జరుగుతుందని వెల్లడించారు.
ప్రజలకు సంబంధించిన పథకాలు, నిధుల వినియోగం, అభివృద్ధి పనుల వివరాలు పారదర్శకంగా అందుబాటులో ఉండేలా సమాచార హక్కు చట్టాన్ని సమర్థంగా వినియోగించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ప్రభుత్వ శాఖలు ప్రజలకు సమాధానాలు ఇవ్వాల్సిన బాధ్యత కలిగి ఉన్నాయని, ఈ చట్టం ద్వారా ప్రజలు తమ హక్కులను సాధించుకోవచ్చని తెలిపారు.
ఇకపై జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా సమాచార హక్కు చట్టం సాధన కమిటీని మరింత బలోపేతం చేస్తూ, ప్రతి స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి, యువతను కూడా ఈ ఉద్యమంలో భాగస్వామ్యం చేస్తానని రమేష్ స్పష్టం చేశారు. సామాజిక న్యాయం, పారదర్శక పాలన కోసం తన శక్తి వంతంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలు పాల్గొని రమేష్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నాయకత్వంలో కమిటీ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

# గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర అత్యంత కీలకం

## – కందుగుల గ్రామ ఉపసర్పంచ్ మండ సతీష్



**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్:**
గ్రామ అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర ఎంతో కీలకమని కందుగుల గ్రామ ఉపసర్పంచ్ మండ సతీష్ అన్నారు. సోమవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకు జనరల్ ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన సతీష్ మాట్లాడుతూ... పంచాయతీ సమావేశాలలో తీర్మానాలను ప్రవేశపట్టడంలో వార్డు సభ్యులకు అధికారం ఉంటుందన్నారు. పంచాయతీ రికార్డులను సైతం పరిశీలించవచ్చునని చెప్పారు. సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ఐక్యంగా ఉండి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని సూచించారు. పంచాయతీరాజ్ చట్టంపై వార్డు సభ్యులు అవగాహన పెంచుకోవాలన్నారు. వార్డు సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి గ్రామ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోవలన్నారు. వార్డుల్లోని పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీటి సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలి అన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలన్నారు. గ్రామ పంచాయతీల్లో వార్డు సభ్యుడు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిని సమన్వయం చేసుకుంటూ అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

# బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని

# జాడి బాల్రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి జెండా ఆవిష్కరణ



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 6**
బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వెస్ట్ జోన్ కన్వీనర్ జాడి బాల్ రెడ్డి ఆధ్వర్యంలో 20వ డివిజన్‌లోని ఐ హాస్పిటల్ చౌరస్తా వద్ద ఘనంగా బీజేపీ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జాడి బాల్ రెడ్డి మాట్లాడుతూ దేశ నిర్మాణంలో బీజేపీ పార్టీ పాత్ర అపూర్వమని , ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దూరదృష్టి నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలో ఒక శక్తివంతమైన దేశంగా ఎదుగుతోందని తెలిపారు. నరేంద్ర మోదీ సాధారణ కుటుంబం నుంచి వచ్చి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రజానాయకుడిగా నిలిచారని, అవినీతి రహిత పాలన, పారదర్శకత, సంక్షేమ పథకాల అమలు ద్వారా కోట్లాది ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చారని పేర్కొన్నారు. ప్రపంచ దేశాల ముందూ భారత గౌరవాన్ని పెంచి, న్యూ ఇండియా కు రూపకల్పన చేసిన మహానేతగా మోదీని కొనియాడారు. తెలంగాణలో బీజేపీ బలపరిచే దిశగా బండి సంజయ్ పోరాటం అభినందనీయమని, బండి సంజయ్ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ, ధైర్యసాహసాలతో బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న నిజమైన యోధుడని అన్నారు. సబ్కా సాథ్ -- సబ్కా వికాస్ -- సబ్కా విశ్వాస్ అనే నినాదంతో బీజేపీ ప్రభుత్వం పేదల సంక్షేమం, మహిళా సాధికారత, రైతుల అభివృద్ధి, యువతకు అవకాశాల కల్పనలో ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు, రామ మందిర నిర్మాణం, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి కీలక కార్యక్రమాల ద్వారా భారతదేశాన్ని శక్తివంతమైన దేశంగా నిలబెట్టిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి గోదారి నరేష్, వెస్ట్ జోన్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు గడ్డం రమేష్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఎం. లక్ష్మీ రాజం, బూత్ అధ్యక్షులు అన్నాజీ వినీత్ కుమార్, బండా రాకేష్, జుట్టు మమత, కొత్తపల్లి శంకర్, మరుపాక సుకన్య, కృష్ణమాచారి, చంద్రగిరి వేణు, వినీత్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బిజెపి ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకున్న బిజెపి శ్రేణులు

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 6**



బిజెపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగ విద్యానగర్ 22వ డివిజన్ 367 బూతులో పశ్చిమ జోన్ మాజీ అధ్యక్షులునరహరి లక్ష్మారెడ్డి, శక్తి కేంద్రం ఇంచార్జ్,గుండారపు సంపత్ ఆధ్వర్యంలో పశ్చిమ జోన్ అధ్యక్షులు జాడిబాల్ రెడ్డి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాల్ రెడ్డి మాట్లాడుతూ జన సంఘ పార్టీ నుండి ఏప్రిల్ 6 1980లో లాల్ కృష్ణ అద్వానీ, అటల్ బిహారీ వాజ్పేయి సారథ్యంలో భారతీయ జనతా పార్టీ ఏర్పడిందని, రెండు పార్లమెంట్ సీట్లతో ప్రారంభమైన బిజెపి ప్రస్థానం ఒకసారి ప్రధానిగా వాజ్పేయి, నరేంద్ర మోడీ నాయకత్వంలో మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోడీ పరిపాలిస్తూ అనేక రాష్ట్రాలలో బిజెపి పరిపాలిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ కోశాధికారి ఖచ్చు మధు, అప్పాల శ్రీనివాస్, భగత్ సేన,ఈ రెడ్డి తిరుమలరెడ్డి, బొంగోని పరుశరాములు, విష్ణు ప్రసాద్ రావు, ఉదారపు విద్యాసాగర్, చందుగౌడ్, దయ్యాల మల్లేశం, శీతాల రమేష్ చంద్ర, దేవదాసు రావు, తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ కార్యాలయాల్లో బెంచ్ లు అందించిన ఆలయ ఫౌండేషన్





**కరపత్రం ప్రతినిధి వీణవంక ఏప్రిల్ 6**
కరీంనగర్ జిల్లా వీణవంక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల సౌకర్యార్థం ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదర్శప్రాయమైన సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఆలయ ఫౌండేషన్ మార్గదర్శకులు పరికిపండ్ల నరహరి ఐఏఎస్ ఆదేశాల మేరకు, ఈరోజు కోఆర్డినేటర్ గాదె గుణసాగర్ నేత ఆధ్వర్యంలో రెండు బెంచీలను ఏర్పాటు చేశారు. ఇందులో ఒక బెంచ్ ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు కూర్చునే సౌకర్యం కల్పించడం జరిగింది.
ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఎక్కువసేపు నిలబడాల్సిన ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ఈ బెంచీలు ఏర్పాటు చేయడం ఎంతో ఉపయుక్తంగా మారిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకుంటూ ముందుకు సాగుతున్న ఆలయ ఫౌండేషన్ సేవలను అందరూ ప్రశంసించారు.
ఈ సందర్భంగా ఆలయ ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, సమాజ సేవే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. గతంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలు గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి అనేక మందికి ఉపయోగకరమైన సేవలు అందించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఘన్ముక్ల మోడల్ స్కూల్ మరియు ఘన్ముక్ల గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలు విశేష స్పందన పొందాయని గుర్తు చేశారు.
“విద్య, వైద్యం, ఉపాధి” అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ఆలయ ఫౌండేషన్ గత పది సంవత్సరాలుగా నిరంతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తోంది. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో నివసిస్తూ కూడా పుట్టిన గడ్డపై సేవ చేయడం నిజంగా అభినందనీయమని పలువురు ప్రజాప్రతినిధులు కొనియాడారు.
అలాగే భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి, పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా తమ సేవలను విస్తరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో వీణవంక తహసీల్దార్ దాసరి రాజమౌళి, ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గాదె గుణసాగర్ నేత, వల్బాపూర్ గ్రామ సర్పంచ్ అందె కుమార్, పల్లెబోయిన రాజ్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కక్షిదారులకు చల్లని ఉపశమనం

## – సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ కోర్టు ఆవరణలో న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్, జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా కక్షిదారులు, న్యాయవాదులకు తాగునీటి సౌకర్యం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు పిట్టల మనోహర్, ప్రధాన కార్యదర్శి పుప్పాల భాను కృష్ణ, జాయింట్ సెక్రెటరీ కనికరపు శ్రీనివాస్, కోశాధికారి జెట్టి శేఖర్, లైబ్రరీ సెక్రటరీ మొగిలి సుజాత, మహిళ ప్రతినిధి తమిరి అన్నపూర్ణ, సీనియర్ ఈసీ మెంబర్ మారు ముఖం అనిల్ కుమార్, జూనియర్ ఈసీ మెంబర్ ఉల్లెందుల అనిల్, సబ్ కోర్టు ఏజీపీ బొడ్డు ప్రశాంత్ కుమార్, ఏపీపీ అవధూత రజనీకాంత్, సీనియర్ న్యాయవాదులు నేరెళ్ల తిరుమల్ గౌడ్, గుడిసె సదానందం, రేగుల దేవేందర్, కిషోర్ రావు, గడ్డం సత్యనారాయణ రెడ్డి, మాదాసు దేవయ్య,రేగుల రాజ్ కుమార్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డు రద్దు చేయాలని బీజేపీ నాయకులు దీక్ష

**– డంపింగ్ యార్డు రద్దు చేస్తూ అధికార ప్రకటన వెలువడే వరకు తెలంగాణ ఉద్యమ తరహాలో ఉధృత పోరాటం**
**– రైతు ప్రజాసంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు**




**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్:**
జనాభిప్రాయ సేకరణ చేయకుండా హుజురాబాద్ మున్సిపల్ సరిహద్దు ప్రాంత సిర్స పల్లి లో గుట్టు చప్పుడు కాకుండా ఎలాంటి పర్యావరణ నిబంధనలు పాటించకుండా నిర్మించ తలపెట్టిన వేస్ట్.టు ఎనర్జీ ఎనర్జీ డంపింగ్ యార్డు ను రద్దు చేస్తూ వారం లోగా అధికార ప్రకటన చేయాలని రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు డిమాండ్ చేశారు. లేకుంటే తెలంగాణ ఉద్యమ తరహాలో ఉద్యమించి వేలాది మంది తో హుజురాబాద్ హైవే ను చతుర్ముఖ వ్యూహం తో అష్ట దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష కు పోలాడి రామారావు మాట్లాడుతూ..
గత 15 రోజులుగా విభిన్న రూపాల్లో హుజురాబాద్ నడి ఒడ్డున డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజల అన్ని పార్టీల భాగస్వామ్యం తో ఉద్యమం జరుగుతుంటే ప్రభుత్వ అధికారుల్లో స్పందన లేదని అధికార ప్రతి పక్షం వాళ్ళు సైతం వ్యతిరేకిస్తూ శిబిరంలో పాల్గొంటుంటే ప్రభుత్వంలో ఎందుకు చలనం లేదని లోపం ఎక్కడ ఉందని రామారావు ప్రశ్నించారు. ఇప్పటికే హుజురాబాద్ ప్రాంతం జిల్లా కేంద్రం కాలేక చుట్టూ హైవే రోడ్ల తో ఒక చిన్న దీప కల్ప ప్రాంతం గా ఉండగా డంపింగ్ యార్డ్ నిర్మిస్తే కరోనా కంటే ఎక్కువగా రోగాల బారిన పడి పచ్చని పొలాలు ఎరుపెక్కి అంతా విషతుల్యమై స్మశాన వాటిక గా మారే అవకాశం ఉందని రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతటి ప్రాణాల కైన తెగించి కోట్లాడి జెజెమ్మలు దిగి వచ్చినా అటున్న సూర్యుడు ఇటు పొడిచినా డంపింగ్ యార్డును ప్రభుత్వ మెడలు వంచి అడ్డుకొని తీరుతామని ఇది మా ప్రజా సంఘాల ఆన అని పోలాడి రామారావు నిప్పులు చెరిగారు. తక్షణమే స్పందించి ప్రాణాంతక అన్నదాతల పశు మత్స్య వర్తక వాణిజ్య వర్గాల పాలిట మృత్యు ఘోష కు కారణ మయ్యే జనావాసాల మధ్య నిర్మించ తలపెట్టిన డంపింగ్ యార్డును తక్షణమే నిలిపి వేయాలని లేకుంటే ఉద్యమం హింసాత్మకంగా మారే ప్రమాదం ఉందని, అప్పుడు శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని దీనికి పాలకులే బాధ్యత వహించాలని పోలాడి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ కార్యక్రమంలో బిజెపి స్థానిక బీజేపీ అధ్యక్షులు కొండాల్ రెడ్డి, విష్ణుదాస్ గోపాల్ రావు, ముచ్చా సమ్మి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎడవెల్లి కొండాల్ రెడ్డి, పొరెడ్డి శంతన్ రెడ్డి, పోల్సాని రామారావు, రాజేశ్వర్ రావు, పల్కల ఈశ్వర్ రెడ్డి, రత్నం, కిరాణ వర్తక సంఘం అధ్యక్షుడు శీల రాజేంద్ర ప్రసాద్, బిజెపి నాయకులు గంగిశెట్టి రాజు, తూర్పాటి రాజు, బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు కొండల్ రెడ్డి, శ్రీనివాస్ హన్మంత రావు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**– ఊరూవాడా జెండా ఎగరేసిన పార్టీ శ్రేణులు**
**– రాష్ట్ర కార్యాలయ వేడుకల్లో పాల్గొన్న అధ్యక్షుడు పివిఎస్ మాధవ్**
**– పార్టీ ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపిన సిఎం చంద్రబాబు**

ఏపీ వ్యాప్తంగా బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఊరూ వాడా పార్టీ శ్రేణులు సంబరాలు చేపట్టారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద పార్టీ ఆవిర్భావ వేడుకల్లో రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఎగురవేసి ... నాయకులు, కార్యకర్తలకు స్వీట్‌లు తినిపించారు మాధవ్. నేటి నుంచి గ్రామపంచాయతీల్లో బీజేపీ ఆధ్వర్యంలో 'మన ఊరు.. మన జెండా' పేరుతో కార్యక్రమం ప్రారంభంకానుంది. దేశంలో విచ్ఛిన్నకర రాజకీయాలకు వ్యతిరేకంగా బీజేపీ పోరాటం చేసిందని పీవీఎన్ మాధవ్ తెలిపారు. అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగా బీజేపీ అనేక రాష్టాల్లో అధికారాన్ని చేపట్టిందన్నారు. పొత్తులతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థితి నుంచి సంపూర్ణ మద్దతుగా ప్రభుత్వం ఏర్పాటు అయ్యే వరకు బీజేపీ బలపడిందని చెప్పుకొచ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక శత్రు దేశాలు దాడి చేసేందుకు కూడా వెనకడుగు వేశాయన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక కుల, మత ఘర్షణలు లేవని తెలిపారు. 'సబ్ కా సాత్.. సబ్ కా వికాస్' నినాదంతో బీజేపీ అడుగులు వేస్తోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేస్తోందని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.